70% యువతకు మొండి'చెయ్యి'

- 30 % మందికే యువవికాసం
- 16.23లక్షల దరఖాస్తులు
- ఇచ్చేది 4.93లక్షల మందికే..
- 5 దశల్లో మంజూరుకు నిర్ణయం
- ముందు రూ.50 వేల యూనిట్లు
- చివరన రూ.4 లక్షల యూనిట్లు
- రాష్ట్ర అవతరణ రోజే మంజూరు అని 2 నెలలుగా ప్రచారం
- తాజాగా ప్రొసీడింగ్స్ నిలిపేయాలని ఆదేశం
- బ్యాంకుల వెరిఫికేషన్ కాకపోవడమే కారణం

రాజీవ్‌యువ వికాసం (ఆర్‌వైవీ) పథకం తీరు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా మారింది. స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు అందిస్తామంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు 70 శాతం మంది యువతకు మొండి చెయ్యి చూపింది. దరఖాస్తుదారుల్లో మొత్తంగా 30 శాతం మందికే రుణాలు మంజూరు చేయనున్నది. అది కూడా ఎమ్మెల్యేలు చెప్పినవారికే ఇవ్వనున్నది. పథకాన్ని మొత్తంగా ఐదు దశల్లో అమలు చేయాలని, తొలుత రూ.50 వేల యూనిట్లు, చిట్టచివరన రూ.4 లక్షల యూనిట్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. జూన్ 2నే రాష్ట్రవ్యాప్తంగా యువతకు యువవికాసం ప్రొసీడింగ్స్ అందిస్తామంటూ రెండు నెలలుగా ఊదరగొట్టినా అదీ ఆచరణలో అటకెక్కింది. మరోవైపు సర్కారు సాయం కోసం 16.23లక్షల మంది నిరుద్యోగ యువత ఎదురుచూస్తున్నది.

హైదరాబాద్, జూన్1 (నమస్తే తెలంగాణ) : రాజీవ్ యువవికాసం పథకం కింద యువతకు సబ్సిడీ రుణాలను ఇస్తామని ప్రభుత్వం ఫిబ్రవరిలో అసెంబ్లీ వేదికగా ప్రకటించింది. పథకం కోసం రూ.6 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు వెల్లడించింది. ప్రతి నియోజకవర్గంలో 5000 మంది యువతకు జూన్ 2 నుంచి 9 వరకు రుణాలు మంజూరు చేస్తామని తెలిపింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 16,23,643 మంది పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మాత్రం అందులో మొత్తంగా 4,93,234 లక్షల మందికే (30.37శాతం) రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇది కేవలం ఆర్‌వైవీ పథకానికి సంబంధించినవే కాగా గతంలో బీసీ బంధు, మైనార్టీ బంధు, ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు దాదాపు మరో 10 లక్షల మంది ఉన్నారు. వారికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించకపోవడం గమనార్హం. ప్రభుత్వం తీరుతో ఆర్‌వైవీ సబ్సిడీ రుణం అందని ద్రాక్షగానే మిగలనున్నది.

ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే!

ప్రస్తుతం ఆర్‌వైవీ పథకం కింద ఇచ్చేది అంతంతమాత్రం కాగా అదీ కాంగ్రెస్ కార్యకర్తలకే అన్నచందంగా మారింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే బాహాటంగా ప్రకటించారు. 'కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలకు అంకితమిస్తూ నిధులను ఉపయోగిస్తాం... పార్టీ కార్యకర్తలకు మాత్రమే కాదు, వారి కుటుంబాలకు కూడా ఆర్థిక భద్రత ఇవ్వడం మా ప్రాధాన్యం. వెంట తిరిగిన కార్యకర్తలకు ఏదైనా చేయాలని అన్ని నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు కూడా నన్ను కోరారు. అందుకే కార్యకర్తలకు స్వయం ఉపాధి పథకం కింద రూ.4 లక్షల వరకు అందిస్తాం. 2 నెలల్లో ఈ డబ్బులు పంపిణీ చేస్తాం. అర్హులైన కార్యకర్తలకు అందించే బాధ్యత ఎమ్మెల్యేలదే' అంటూ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అందుకు అనుగుణంగానే పథకం మార్గదర్శకాలు రూపొందించారు. అంతిమంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే లబ్ధిదారులను ఎంపిక చేయాలనే నిబంధనను చేర్చడమే అందుకు నిదర్శనం. ఇప్పుడు క్షేత్రస్థాయిలో పథకాన్ని కార్యకర్తలకే అమలు చేస్తున్నట్టుగా ఉన్నదని యువత మండిపడుతున్నది..

ఊదరగొట్టి.. ఊసురుమనిపించి..

ఆర్‌వైవీ పథకం మార్గదర్శకాలను ప్రభుత్వం రెండు నెలల ముందుగానే జారీ చేసింది. తొలుత ఏప్రిల్ 5లోగా దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించినా ఆ గడువును 14 వరకు పొడగించింది. ప్రభుత్వ మార్గదర్శకాలు, జనాభా దామాషా, క్యాటగిరీల వారీగా మంజూరైన యూనిట్ల మేరకు మే 20లోగా అర్హులను మండలస్థాయి కమిటీ ఎంపిక చేయాలి. ఆ జాబితాను జిల్లా కమిటీలకు పంపాలి. జిల్లా కమిటీలు 31లోగా తుది జాబితాను సిద్ధం చేసి, ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారులను ప్రకటించాలి. జూన్ 2 నుంచి 9 వరకు లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను పంపిణీ చేస్తామని సర్కారు ప్రకటించింది. కానీ ఇప్పటికీ అర్హుల జాబితాను ఎక్కడా ప్రకటించలేదు. అదీగాక నిన్నమొన్నటి వరకు ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించిన ప్రభుత్వం తాజాగా ఆ ప్రక్రియను అంతా పక్కన పెట్టాలని ఆదేశించినట్టు తెలుస్తున్నది. అందుకు ప్రధానకారణంగా లబ్ధిదారుల ఎంపికలో స్థానిక కాంగ్రెస్ నేతల జోక్యం, ఒత్తిడేనని తెలుస్తున్నది. ఆన్‌లైన్ దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం లీడ్ బ్యాంకులకు పంపాల్సి ఉన్నది. బ్యాంకులు లబ్ధిదారుల సిబిల్ స్కోర్‌ను పరిశీలించి సంతృప్తి చెందితేనే రుణాల మంజూరుకు మొగ్గుచూపుతున్నాయి. లీడ్ బ్యాంకుల పరిశీలన పూర్తయితేగానీ రుణాల మంజూరు ప్రక్రియ ముందుకుసాగని పరిస్థితి! ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కేవలం 55 శాతం దరఖాస్తుల వరకే బ్యాంకు వెరిఫికేషన్ పూర్తయింది.

4 లక్షల యూనిట్లలో కోత!

ప్రభుత్వం మొత్తంగా రూ.6 వేల కోట్ల సబ్సిడీ రుణ మొత్తాన్ని 5 రకాల యూనిట్లుగా విభజించింది.రూ.50 వేల యూనిట్లను మాత్రమే 100 శాతం సబ్సిడీతో అందిస్తున్నది. రూ.లక్ష యూనిట్‌లో రూ.90 వేలు ప్రభుత్వం, 10 వేలను రుణంగా, రూ.2 లక్షల యూనిట్‌లో రూ.1.6 లక్షలను ప్రభుత్వం, మిగతా రూ.40 వేలు బ్యాంకు రుణంగా, రూ.3లక్షల యూనిట్‌లో రూ.2.1 లక్షలు ప్రభుత్వం, మిగతా రూ.90 వేలు బ్యాంకు రుణంగా, రూ.4 లక్షల యూనిట్‌లో రూ.2.8 లక్షలు ప్రభుత్వం, మిగతా రూ.1.2 లక్షలు బ్యాంకు రుణంగా అందివ్వాలని నిర్ణయించింది. వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 75 శాతానికి పైగా 4 లక్షల యూనిట్ల కోసమేనని అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం 2 లక్షల నుంచి 4 లక్షల రుణాలకు సంబంధించి ప్రభుత్వం కేవలం 3లక్షల యూనిట్లను మాత్రమే మంజూరు చేసింది. వాటికే దాదాపు 4500 కోట్లు వెచ్చించాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో యూనిట్లలో కోత విధించాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. రూ.50 వేల నుంచి లక్ష యూనిట్లకే ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా ఎక్కువ మందికి ఇచ్చినట్టుగా ప్రచారం చేసుకునే అవకాశమూ ఉంటుందని సూత్రప్రాయ అంగీకారానికి వచ్చినట్టు సమాచారం. అందుకు అనుగుణంగా తాజాగా అధికారులకు మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. యూనిట్లను మార్పు చేసేందుకు ఎంపీడీవోలకు అవకాశం కల్పించింది. ఎంపీడీవో లాగిన్ నుంచి యూనిట్లను మార్పు చేయవచ్చని తెలిపింది. మొత్తంగా రూ.4 లక్షల యూనిట్లలో కోత తప్పదని అధికారులు సైతం వెల్లడిస్తున్నారు.

ఐదు విడతల్లో మంజూరు ఇలా..

ఫేజ్	నెల	యూనిట్ క్యాటగిరీ	ఎంతమందికి	ఇచ్చే సబ్సిడీ (కోట్లలో)
1	జూన్	రూ.50 వేలు-లక్ష	85000	650
2	జూలై	రూ.లక్ష-2 లక్షలు	100000	1000
3	ఆగస్టు	రూ.2 లక్షలు-3 లక్షలు	100000	1500
4	సెప్టెంబర్	రూ.2 లక్షలు-4 లక్షలు	100000	1500
5	అక్టోబర్	రూ.2 లక్షలు-4 లక్షలు	1,08,234	1600.50
మొత్తం			4,93,234	రూ.6250.50 కోట్లు

రాజీవ్ యువవికాసం పథకం కోసం వచ్చిన మొత్తం దరఖాస్తులు :
16,23,643

ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తయినవి :
15,53,551 (95.68%)

అర్హుల ఎంపికకు బ్యాంకులకు పంపిన దరఖాస్తులు :
13,83,950 (85.24%)

బ్యాంకులు ఇప్పటివరకు పరిశీలించినవి :
8,93,219 (55.01%)

విద్యుత్తు లేకుంటే వైద్యులు బాధ్యులా?

- దవాఖానల్లో వసతుల కల్పనలో సర్కార్ విఫలం
- తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్ ఆందోళన

హైదరాబాద్ జూన్1 (నమస్తే తెలంగాణ): జహీరాబాద్ ప్రభుత్వ దవాఖాన ఘటనపై స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) అధ్యక్షుడు డాక్టర్ నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లాలూప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎంకే రవూఫ్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోతే వైద్యులు బాధ్యులా? అని ప్రశ్నించారు. శస్త్రచికిత్స సమయంలో విద్యుత్తు సరఫరా నిలిచి పోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సెల్‌ఫోన్ల ఫ్లాష్‌లైట్లు, టార్చ్‌లైట్ల సాయంతో సేవలు కొనసాగించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ ఘటనకు ప్రభుత్వ వైద్యులను బాధ్యులను చేసి వేటు వేయడం బాధాకరమని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనలో విఫలమైన ఆరోగ్యశాఖ డాక్టర్లపై ఆగమేఘాలపై సస్పెన్షన్ వేటు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టకుండానే డాక్టర్ల నిర్లక్ష్యమని నిర్ధారించడం అన్యాయమని తెలిపారు. జనరేటర్లు, అత్యవసర పరిస్థితుల్లో కరెంట్ సౌకర్యం కల్పించాల్సిన ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్పష్టంచేశారు. నిష్పాక్షిక విచారణతోనే వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు. వాస్తవాలను పక్కనబెట్టి వైద్యులను బాధ్యులను చేయడం టీవీవీపీ కమిషనర్ ఒంటెద్దు పోకడలకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై స్వతంత్ర విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ దవాఖానల్లో మౌలిక వసతులపై ఆడిట్ చేయాలని, ప్రజారోగ్య వ్యవస్థను పటిష్ఠం చేయాలని వారు డిమాండ్ చేశారు.

తుమ్మల నారాజ్..!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నారా? నిధుల కేటాయింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిలదీశారా? అంటే ఈ ప్రశ్నలకు వ్యవసాయ శాఖ వర్గాలు 'ఔను' అనే సమాధానాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తరువాత రాష్ట్ర రైతాంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నదనే అభిప్రాయాలున్నాయి. అరకొర రుణమాఫీ, ఆగిన రైతుభరోసా, ధాన్యం కొనుగోళ్లు, ఎరువులు, విత్తనాల కొరత.. ఇలా ప్రతి అంశంలోనూ రైతులు మళ్లీ గోస పడుతున్నారు. ఈ పరిస్థితులకు ప్రభుత్వ పెద్దలే కారణమనే అభిప్రాయాన్ని మంత్రి తుమ్మల వ్యక్తంచేసినట్టు తెలిసింది. 'ఆ ఇద్దరు' కీలక మంత్రులు వ్యవసాయ శాఖకు అవసరమైన నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆలోచనలో మంత్రి ఉన్నట్టు వ్యవసాయ శాఖలో చర్చ జరుగుతున్నది.

నిధుల్లేక ఆగిన రైతు పథకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత గతంలో ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయ శాఖను నిధుల గండం వేధిస్తున్నది. దీంతో అనేక రైతు పథకాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. చీటికీ మాటికీ మంత్రుల హెలికాప్టర్ ప్రయాణాలు, రూ.27 కోట్లు ఖర్చు చేసి మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ, చెల్లదని తెలిసినా రూ.160 కోట్లతో కులగణన.. ఇలా ప్రభుత్వం అనేక సందర్భాల్లో అనవసర ఖర్చులు చేస్తున్నదనే విమర్శలున్నాయి. ఈవిధంగా రూ.కోట్లకు కోట్లు వృథా చేస్తున్న సర్కారు... రైతుల ప్రయోజనాల కోసం మాత్రం నిధులు విడుదల చేసేందుకు ససేమిరా అంటున్నట్టు తెలిసింది. రైతుభరోసా పథకాన్ని అర్థాంతరంగా నిలిపేసింది. ఈ పథకం కింద యాసంగి సీజన్‌కు రూ.9,300 కోట్లు ఇవ్వాల్సి ఉండగా రూ.5వేల కోట్లు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకున్నది. మిగిలిన రూ.4,300 కోట్లు విడుదల చేయడం లేదు. రైతు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించే రైతుబీమాకు కూడా సర్కారు ప్రీమియం చెల్లించకపోవడం గమనార్హం. దీంతో మరణించిన రైతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల పరిహారం అందడం లేదు. పంటల బీమాను అమలు చేస్తామని గొప్పగా చెప్పిన ప్రభుత్వం.. రూ.మూడు వేల కోట్లు చెల్లించలేక ఆ పథకాన్నీ అమలు చేయడం లేదు. నిరుడు పచ్చిరొట్ట విత్తనాల బకాయిలు చెల్లించకపోవడంతో సరఫరాదారులు విత్తనాలు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీంతో రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యం కొనుగోలు సమస్యలు అన్నీ ఇన్నీ కావు. రైతులు నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని గొప్పగా ప్రకటించిన సర్కారు.. రైతులు సన్న ధాన్యం విక్రయించి నెల రోజులు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా వారికి చెల్లించలేదు.

నిధులపై సీఎంను నిలదీసిన తుమ్మల!

ఇటీవల వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తన అసంతృప్తిని వెళ్లగక్కినట్టు తెలిసింది. రైతుభరోసా, రైతుబీమా, విత్తనాలకు సంబంధించి ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. రైతు పథకాలకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని సీఎంను నిలదీసినట్టు సమాచారం. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి కల్పించుకొని ఆర్థిక శాఖ ముఖ్య అధికారికి ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల.. ఇలాంటి దిద్దుబాటు చర్యలు వద్దని, వ్యవసాయ శాఖ, రైతు పథకాలకు సకాలంలో నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పినట్టు తెలిసింది. ప్రభుత్వంపై రైతుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని, పరిస్థితి ఇలాగా ఉంటే ఈ వ్యతిరేకత పెరగడం ఖాయమని హెచ్చరించినట్టు సమాచారం.

'పేట' ఎమ్మెల్యే ఇంటి ముట్టడి

ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని డిమాండ్

దమ్మపేట, జూన్ 1: స్థానిక సమస్యల పరిష్కారం కోసం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఇంటిని సీపీఐ నేతలు ఆదివారం ముట్టడించారు. డబుల్ బెడ్‌రూం, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం ఎమ్మెల్యే స్వగ్రామమైన గండుగులపల్లిలోని జారే ఇంటిని సీపీఐ నాయకులు, నిరుపేదలు ముట్టడించి ధర్నా చేశారు. కాగా, ఎమ్మెల్యే జారే.. ఆందోళనకారులను లోపలికి పిలిపించుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు మూడు రోజుల్లో అధికారులను విచారణకు పంపి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నేటి నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

- రిజిస్ట్రేషన్లలో ఏఐ సాంకేతికత
- అందుబాటులోకి

82476 23578 'మేధ' వాట్సాప్ నంబర్

హైదరాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ): భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమలుకానున్నది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు నిర్వహించగా సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు రిజిస్ట్రేషన్ల శాఖ చర్యలు చేపట్టింది. రిజిస్ట్రేషన్లలో ఏఐ సాంకేతికతను కూడా వినియోగించనున్నారు. ఏఐ చాట్‌బాట్ మేధా వాట్సప్ నంబర్ 82476 23578తో వినియోగదారులు పలు అంశాలు తెలుసుకునే అవకాశం ఉంది. ఈ మేరకు స్లాట్ బుకింగ్ విధానం అమలుపై ఆదివారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకత, అవినీతి రహిత సేవల కోసం స్లాట్‌బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు.

నెలలవారీగా వచ్చిన ఎల్ఆర్ఎస్ ఆదాయం

మార్చి 31వ తేదీ వరకు
1,513 కోట్లు
ఏప్రిల్ 30వ తేదీ వరకు
1,863 కోట్లు
మే 31వ తేదీ వరకు
1,986 కోట్లు

ఎల్ఆర్ఎస్ ఆదాయం 1,986 కోట్లు

- ముగిసిన 25 శాతం రాయితీ గడువు
- ఈ నెలాఖరు వరకు పొడిగించే అవకాశం?

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) ఫీజుపై రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 25% రాయితీ గడువు మే 31వ తేదీతో ముగిసింది. రాయితీ పథకం కింద రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరుతున్న నేపథ్యంలో ఈ నెలాఖరు వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం కింద ఇప్పటికే ఎల్ఆర్ఎస్ ఫీజుపై 25% రాయితీ గడువును మూడు సార్లు పొడిగించారు. తొలుత ఫిబ్రవరి నుంచి మార్చి వరకు, ఆ తర్వాత ఏప్రిల్ వరకు, ఏప్రిల్ నుంచి మరో మూడు రోజులు, ఆ తర్వాత మే 31 వరకు పొడిగించారు. ఈ పథకం ద్వారా శనివారం వరకు రాష్ట్రానికి రూ.1,986 కోట్ల ఆదాయం సమకూరింది. 2020లో ప్రారంభమైన ఎల్ఆర్ఎస్ కింద 25.67 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 5.75 లక్షల మందికి ఎల్ఆర్ఎస్ ఎస్టిమేషన్ ఫీజు లేఖలు పంపగా, 3.25 లక్షల మంది ఫీజు చెల్లించారు. ఈ ప్రక్రియ ద్వారా మే 31 వరకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,986.55 కోట్ల ఆదాయం సమకూరింది.ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు దరఖాస్తుదారులను వేధిస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులు చేసినప్పటికీ 'ఫీజు నోటిఫై కాలేదు' అనే ఎర్రర్ రావడం, దరఖాస్తు స్టేటస్‌ను తెలుసుకోలేకపోవడం, ఓటీపీ సమస్యలు, సర్వర్ క్రాష్ వంటి సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. కొందరు దరఖాస్తుదారులు తమ ప్లాట్లు నిషేధిత జాబితాలో ఉన్నట్టు చూపించడం లేదా అసాధారణంగా అధిక రుసుములు విధించడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.

అనతి కాలంలోనే ఎందుకింత వ్యతిరేకత?

నేతల మధ్య విభేదాలు ఎందుకు వస్తున్నాయి?

- 10%, 30% కమీషన్ల ఆరోపణల్లో నిజమెంత?
- కేసీఆర్‌కు నోటీసులపై రైతుల స్పందన ఏమిటి?
- కాంగ్రెస్ నేతలను ఆరా తీసిన మీనాక్షి నటరాజన్
- వరంగల్, నాగర్‌కర్నూల్, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో సమీక్షలు

హైదరాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన తర్వాత అనతి కాలంలోనే ప్రభుత్వంపై ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఎందుకు వచ్చిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరా తీసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మంత్రుల మీద పెద్ద ఎత్తున వస్తున్న 10%, 30% కమీషన్ల ఆరోపణల్లో వాస్తవం ఏంత? అని కాంగ్రెస్ నేతలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఆమె ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వరంగల్, నాగర్‌కర్నూల్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నాయకులతో సమావేశమయ్యారు. ఆయా ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లతో వేర్వేరుగా మాట్లాడారని తెలిసింది. కాంగ్రెస్ పాలనపై, క్షేత్రస్థాయి పరిస్థితులపై వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నట్టు చెప్తున్నారు.

నోటీసులను రాజకీయ కక్షగానే చూస్తున్నారు

కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై రైతులు, ప్రజలు ఏమనుకుంటున్నారని మీనాక్షి ఆరా తీసినట్టు సమాచారం. కాళేశ్వరం కూలిపోయిందని రైతులు నమ్ముతున్నారా? అని వరంగల్ నేతలను అడిగినట్టు తెలిసింది. కేసీఆర్ పట్ల తెలంగాణ ప్రజలకు విశ్వాసం సడలలేదని, ఆయనకు నోటీసులు ఇవ్వడాన్ని ప్రజలు రాజకీయ కక్షగానే చూస్తున్నారని, రైతులు మాత్రం గుంభనంగా ఉన్నారని నేతలు ఆమెకు వివరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మంత్రుల మధ్య విభేదాలపై వరంగల్ నేతలను అడిగినప్పుడు వారు మంత్రి కొండా సురేఖపై పలు ఫిర్యాదులు చేశారని సమాచారం. మంత్రి వర్గం నుంచి ఆమెను తొలగించి పార్టీని కాపాడాలని మీనాక్షిని కోరినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

మంత్రుల్లో ఎవరిని తీసేయొచ్చు?

గతంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని కొందరు ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశం కావడంపై మీనాక్షి ప్రత్యేకంగా ఆరా తీసినట్టు తెలిసింది. అలా ఎందుకు చేయాల్సి వచ్చింది? 30 పర్సెంట్ కమీషన్ తీసుకునే మంత్రి ఎవరు? అంటూ ప్రత్యేకంగా ప్రశ్నించి, వివరాలు సేకరించినట్టు చెప్పుకుంటున్నారు. 12 పర్సెంట్ కమీషన్ తీసుకునే మంత్రి ఎవరు? మంత్రుల మీద వస్తున్న ఆరోపణలు ఎంత వరకు నిజం? ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి పదవులు పొందటానికి ఎవరెవరు అర్హులు ఉన్నారు? ఇప్పుడున్న మంత్రుల్లో ఎవరినైనా తొలగించాలా? అని నాగర్‌కర్నూల్ నేతలను అడిగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఉమ్మడి జిల్లాలో మాదిగ నాయకుల బలాబలాలు, క్షేత్రస్థాయిలో కుల చైతన్యం ఉన్నదా? అని కూడా ఆరా తీసినట్టు తెలిసింది.

మంత్రుల మధ్య సఖ్యత లేదు

నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, పార్టీ బలోపేతానికి ఇంకా ఏమేం చేస్తే బాగుంటుంది, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా, ప్రజలు ఏమనుకుంటున్నారు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టి వివరాలు సేకరించినట్టు తెలిసింది. ముఖ్యంగా ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పరిస్థితిపై ఆరా తీసినట్టు సమాచారం. ఎక్కువ మంది నేతలు రాష్ట్రంలో విద్యుత్తు కోతలు, విత్తనాల కొరత ఉన్నదని ఆమె దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా అతి తక్కువ కాలంలోనే ప్రభుత్వంపై వ్యతిరేకత రావడానికి గల కారణాలను వివరించారని, వాటిని ఆమె నోట్ చేసుకున్నారని చెప్పుకుంటున్నారు. ఇక మీ ప్రాంతంలోని ముఖ్య నేతల మధ్య సఖ్యత ఎలా ఉన్నదని మీనాక్షి అడిగినప్పుడు.. 'ఏ ఇద్దరు మంత్రుల మధ్య కూడా సఖ్యత లేదు' అని నేతలు కుండబద్దలు కొట్టినట్టు సమాచారం.

మంత్రిగా అవకాశం ఇవ్వండి

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు విజయశాంతి, అద్దంకి దయాకర్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌రెడ్డి 15 నిమిషాల పాటు మీనాక్షి నటరాజన్‌తో ప్రత్యేకంగా భేటీ అయినట్టు తెలిసింది. తాను పార్టీ కోసం త్యాగం చేశానని, మంత్రి పదవికి అర్హుడనని, మంత్రివర్గ విస్తరణలో తన పేరును పరిశీలించాలని అద్దంకి దయాకర్ కోరినట్టు సమాచారం.

పట్టణ పేదలకు 'ఇందిరమ్మ' తిప్పలు!

- ఉన్న ఇండ్లను కూల్చి అపార్ట్‌మెంట్ల నిర్మాణం
- ఇన్-సిటూ విధానంపై లబ్ధిదారుల్లో సందేహాలు
- ఎప్పటికి పూర్తవుతాయో?
- అప్పటివరకు అద్దెలు ఎలా భరించాలి?
- గడువులోగా పూర్తికాకుంటే లబ్ధిదారుల పరిస్థితేమిటి?

- ఇందిరమ్మ ఇండ్ల కోసం రాస్తారోకో

ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమ పేర్లు గల్లంతయ్యాయని కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో పోచారం కాలనీవాసులు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నామని, మొదటి జాబితాలో తమ పేర్లు రాగా అప్పుచేసుకుని మరీ ఇండ్లు కట్టుకున్నట్టు తెలిపారు. ఇటీవల విడుదలైన జాబితాలో తమ పేర్లను గల్లంతు చేశారని ఆరోపించారు. - నస్రుల్లాబాద్

హైదరాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న పట్టణ పేదలు ప్రభుత్వం చెప్తున్న ఇన్-సిటూ (ఉంటున్నచోటే ఇల్లు నిర్మించడం) విధానంపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికి కారణం ప్రభుత్వం ఇండ్లు నిర్మించే వరకు వారు అద్దె ఇంటిలో ఉండాల్సి రావడమే. ఏదైనా కారణంతో ప్రభుత్వ ప్రతిపాదిత ఇండ్ల నిర్మాణం ఆలస్యమైతే మాత్రం పేదలు అద్దెలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇండ్లను నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా, ఇప్పటివరకు ఇంటి స్థలం ఉన్న 2,03,744 మందికి మాత్రమే ఇండ్లు మంజూరుచేశారు. స్థలంలేని పేదలకు రెండో విడతలో నిర్మించాలని నిర్ణయించారు. పట్టణాల్లో మురికివాడల్లో నివశిస్తున్న పేదలకు వారు ప్రస్తుతం ఉంటున్న గుడిసెలను తొలగించి అదేచోట మూడు అంతస్తుల అపార్ట్‌మెంట్లు (ఇన్-సిటూ విధానం) నిర్మించి ఒక్కొక్కరికి కనీసం 550-600 చదరపు అడుగులమేర ఫ్లాట్లు కేటాయించాలని నిర్ణయించారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ప్రభుత్వం తమ ఇండ్లను తొలగించి ఎంతకాలంలోగా అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇస్తుందోననే సందేహాలు లబ్ధిదారుల్లో వ్యక్తమవుతున్నాయి. అపార్ట్‌మెంట్లు నిర్మించేవరకు తాము అద్దె ఇంటిలో ఉండాల్సి ఉంటుందని, ఒకవేళ నిర్మాణాల్లో జాప్యం జరిగితే తమపై అద్దెల భారం పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వానికి నిధుల సమస్య ఉన్నదని సాక్షాత్తూ ముఖ్యమంత్రే పదేపదే చెప్తుండటంతో అపార్ట్‌మెంట్ల నిర్మాణం సజావుగా సాగుతుందా? నిధుల సమస్య ఎదురై మధ్యలో ఆగిపోతే తమ పరిస్థితి ఏమిటి? అని వారు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వమే అద్దెలు భరించాలి

హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ఇంటి అద్దెల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చిన్న సింగిల్ రూమ్‌కే కనీసం రూ.5,000-8,000 వరకు చెల్లించాల్సి వస్తున్నది. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇన్-సిటూ పద్ధతిలో చేపట్టే ఇండ్లను ఏడాదిలోగా పూర్తిచేసి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. లేనిపక్షంలో ఇండ్ల లబ్ధిదారుల కోసం ప్రభుత్వమే అద్దెలు నిర్ణయించి, ఏడాది గడువు పూర్తయ్యాక ఎంతకాలం ఆలస్యమైతే అంతకాలం ప్రభుత్వమే వారికి అద్దెలు చెల్లించాలని కోరుతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇన్-సిటూ పద్ధతిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో 40 మురికివాడల్లో దాదాపు 9,837 ఇండ్లను గడువులోగా నిర్మించి పేదలకు పంపిణీచేసింది. ఒక్కో యూనిట్‌పై సుమారు రూ.7.5 లక్షల నుంచి రూ.8.65 లక్షల వరకు ఖర్చుచేసింది. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇండ్ల నిర్మాణానికి గడువు నిర్ధారించి పూర్తిచేయాలని సూచిస్తున్నారు.

సమన్వయం లేకుంటే సరికొత్త సమస్యలు

ఇండ్ల నిర్మాణం ఒక ఎత్తైతే.. మౌలిక సదుపాయాల కల్పన మరో ఎత్తు. ఒకవైపు ఇండ్ల నిర్మాణం పూర్తవుతుంటే, మరోవైపు మంచి నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్తు తదితర కనీస సదుపాయాలు కూడా పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరం. శాఖల మధ్య సమన్వయం లేకపోతే చాలా సమస్యలు ఎదురవుతాయని, ఇండ్లు నిర్మించినా వాటిని లబ్ధిదారులకు కేటాయించే పరిస్థితి ఉండదని అధికారవర్గాలు చెప్తున్నాయి.

నా తండ్రిని బలిగొన్నది ప్రభుత్వమే!

- *పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతోనే డెంగీ సోకిందని ఆగ్రహం*
- *శ్మశానంలో వీడియోతీసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన కుమారుడు*
- *కాంగ్రెస్ సర్కారు ప్రజల ప్రాణాలు బలిగొంటున్నదని నెటిజన్లు ఫైర్*

తండ్రి మృతిపై ఆవేదన వ్యక్తంచేస్తూ సోషల్‌మీడియాలో చేసిన పోస్ట్

వడ్డేపల్లి, జూన్ 1: పాలకులు, అధికార యంత్రాంగం ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహించకపోతే జనం సమస్యల వలయంలో చిక్కుకుంటారు. ఒక్కోసారి పాలకుల నిర్లక్ష్యానికి మూల్యంగా కొందరు అభాగ్యులు ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుంది. ఇలాంటి ఓ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. శాంతినగర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డుకు చెందిన తిరుపాల్(66) తీవ్రజ్వరంతో బాధపడగా కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ అని నిర్ధారించారు. చికిత్స పొందుతూ ఉండగా పరిస్థితి విషమించి, తిరుపాల్ మృతిచెందాడు. తిరుపాల్ అంత్యక్రియల అనంతరం శ్మశానం నుంచే ఆయన కుమారుడు దురేందర్‌యాదవ్ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. ప్రభుత్వం, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన తండ్రి మృతి చెందాడని ఆ వీడియోలో యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు. కాలనీలలో పారిశుధ్య పనులు చేయించడం లేదని చెప్పాడు. వర్షాలకు మురుగు ఎక్కడికక్కడ పేరుకుపోయిందని, అంటురోగాలు వ్యాప్తి చెందుతున్నాయని వివరించాడు. ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో మగ్గిపోతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డాడు. మురుగునీరు రోజులతరబడి పేరుకుపోవడంతోనే దోమలు విజృంభించాయని, తన తండ్రికి డెంగీ సోకి మృతి చెందాడని ఆవేదన వ్యక్తంచేశాడు. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించాలని కోరాడు. దురేందర్ తన తండ్రి మృతిపై ఆవేదన వ్యక్తంచేస్తూ విలపించడం.. నెటిజన్లను కంటతడిపెట్టిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పడకేసిందని, కనీసం పారిశుధ్య నిర్వహణకు కూడా సక్రమంగా జరగడంలేదని మండిపడుతున్నారు.